క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

యాచారం: విద్యుత్ లైన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా సోమవారం పలు గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ సందీప్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి, మాల్, నల్లవెల్లితండా, భానుతండా, కేసీతండా, నుస్సావత్‌తండా, తమ్మలోనిగూడ, చింతపట్ల, కిషన్‌పల్లి, కొత్తపల్లి, తక్కళ్లపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత



దశరథం కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న మిత్రులు

కడ్తాల్: మండల పరిధిలోని ముద్విన్ గ్రామానికి చెందిన దశరథం అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఆదివారం ముద్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1993–94 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన అతని చిన్ననాటి మిత్రులు పరామర్శించి రూ.50వేల ఆర్థికసాయం అందించారు. భవిష్యత్‌లో ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని మిత్రుడి కుటుంబ సభ్యులకు ధైర్యానిచ్చారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



కాంగ్రెస్ నాయకులతో రంగారెడ్డి

తుర్కయంజాల్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్‌లో ఆయన పర్యటించారు.అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత ధన్‌రాజ్ గౌడ్, కౌన్సిలర్లు రవీందర్ రెడ్డి, మేతరి అనురాధ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

‘పల్లెపల్లెకూ బీజేపీ’ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో ఓబీసీల సంక్షేమానికి పీఎం నరేంద్రమోదీ అందించిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి తెలియజేయాలని నియోజకవర్గ ఓబీసీ ఇన్‌చార్జి జంగమయ్యగౌడ్ అన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న పల్లెపల్లెకు ఓబీసీ–ఇంటింటికీ బీజేపీ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఆదివారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులుప్రతాప్, పాపయ్యగౌడ్, మండల అధ్యక్షుడు విష్ణుగౌడ్, నాయకులు యాదగిరి, గోవర్ధన్, శ్రావన్‌చారి, రాజు, ధర్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బహుజన విప్లవకారుడు సర్వాయిపాపన్న



నివాళి అర్పిస్తున్న గౌడసంఘం నాయకులు

ఆమనగల్లు: బహుజన విప్లవకారుడు సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ వర్ధంతిని ఆమనగల్లు పట్టణంలో ఆదివారం గౌడసంఘం, బీఆర్ఎస్ పార్టీల ఆధ్వర్యంలో వేర్వేరుగా నిర్వహించారు. జాతీయ రహదారిపై పాపన్నగౌడ్ చిత్రపటాన్ని ఉంచి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్, గౌడసంఘం నాయకులు అల్లాజీగౌడ్, గంగారవిగౌడ్, కుమార్‌గౌడ్, నారాయణగౌడ్, నాగయ్య, నిరంజన్‌గౌడ్, బాలకృష్ణ, పరమేశ్, మల్లేశ్, హరినాథ్, శ్రీధర్, శ్రీను, మనోజ్, బీఆర్ఎస్ నాయకులు బీఆర్ఎస్ నాయకులు జయరాం నాయక్, గుత్తి బాలస్వామి, రమేశ్, వెంకట్‌రెడ్డి, సోన శ్రీనునాయక్, సాయిలు, వెంకటేశ్, భాస్కర్, రమేశ్, అల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా బస్టాండ్లు

- మాల్, యాచారం ఆర్టీసీ ప్రాంగణాల్లోకి రాని బస్సులు
- ప్రధాన రహదారిపైనే ప్రయాణికులను ఎక్కించుకుంటున్న వైనం
- కబ్జాకు గురవుతున్న బస్టాండ్ ప్రాంగణాలు
- వినియోగంలోకి తేవాలంటున్న స్థానికులు



యాచారం ఆర్టీసీ బస్టాండ్

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై యాచారం, మాల్ కేంద్రాల్లో ఆర్టీసీ బస్టాండ్‌లు నిరుపయోగంగా మారాయి. ఈ బస్టాండులు ఎప్పుడు వాడుకలోకి వచ్చేనా అని ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు. 15 ఏళ్ల కింద దాదాపు రూ.50 లక్షల నిధులతో మాల్, యాచారం కేంద్రాల్లో ఆర్టీసీ బస్టాండులను నిర్మించారు. దాతల సహకారంతో విలువైన స్థలాల్లో అధికారులు బస్టాండ్‌లు నిర్మించారు. మొదట్లో ఈ బస్టాండ్‌లోకి బస్సులు రాకపోకలు సాగించేవి. అప్పట్లో సాగర్‌రోడ్డుపై రాకపోకలు సాగించే మాచర్ల, గుంటూర్, దేవరకొండ, నల్గొండ, కల్వకుర్తి తదితర డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లోకి వచ్చిపోయేవి. అప్పట్లో ఈ బస్టాండ్‌లు ఇళ్లకు దూరంగా నిర్మించడం వల్ల ప్రయాణికులు రాకున్నా బస్సులు మాత్రం వచ్చిపోయేవి. గత ఐదేళ్లగా బస్సులు ఈ బస్టాండ్‌లోకి రావడం లేదు. బస్టాండ్ వరకు ఇంటి నిర్మాణాలు జరిగినా బస్సులు మాత్రం వచ్చిపోవడం లేదు. బస్టాండ్ ఎదుట ప్రధాన రహదారిపైనే ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లిపోతున్నాయి. దీనికి తోడు బస్టాండ్‌లో మౌలిక వసతులు లేకపోవడంతో ప్రయాణికులు బస్టాండ్‌లోకి వచ్చేందుకు విముఖత చూపిస్తున్నారు.

అక్రమార్కుల కన్ను

యాచారం, మాల్ కేంద్రాల్లో దాదాపు మూడు ఎకరాలకు పైగా స్థలంలో ఆర్టీసీ బస్టాండ్‌లు నిర్మించారు. ఈ స్థలం ప్రస్తుతం విలువ రూ.10 కోట్లకు పైగానే ఉంటుంది. బస్టాండ్‌లు నిరుపయోగంగా ఉండటం వల్ల అక్రమార్కుల కన్ను ఈ స్థలంపై పడింది. స్థలాన్ని కబ్జా చేయడానికి పలువురు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు పుకార్లు వస్తున్నాయి. యాచారం, మాల్ కేంద్రాల్లో ఇంటి నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలియడం, రోడ్డుపై ట్రాఫిక్ రద్దీ కూడా అధికంగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. యాచారంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు అక్కడే నిలుపడం వల్ల ట్రాఫిక్‌జాం ఏర్పడుతుంది. పైగా అక్కడే చిరువ్యాపారులు దుకాణాలు పెట్టి రోడ్డును పూర్తిగా ఆక్రమిస్తున్నారు. మాల్‌లో రంగారెడ్డి–నల్గొండ జిల్లాల సరిహద్దులో



మాల్ ఆర్టీసీ బస్టాండ్

నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌లను వాడుకలోకి తెస్తే.. స్థలాలు కూడా కబ్జాకు గురికాకుండా రక్షించే అవకాశం ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు.

ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతా



నిరుపయోగంగా ఉన్న యాచారం, మాల్ ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులను ఆపేలా చర్యలు తీసుకుంటాం. 15 ఏళ్ల కింద ఈ బస్టాండ్‌లు నిర్మించినప్పుడు గ్రామాలకు దూరంగా ఉండేవి. ప్రస్తుతం ఇంటి నిర్మాణాలు పెరగడంతో ఇళ్ల మధ్యనే బస్టాండ్‌లు ఉన్నాయి. మాల్, యాచారం కేంద్రాల్లో ప్రయాణికుల రద్దీ కూడా పెరిగింది. బస్టాండ్లు వాడుకలోకి తీసుకువస్తాం.

– కొప్పు సుకన్య, ఎంపీపీ, యాచారం

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం



బొడ్రాయి పూజలో ఎమ్మెల్సీ నారాయణరెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామంలో రెండు రోజులుగా నిర్వహించిన బొడ్రాయి వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ముగిశాయి. వేడుకల్లో భాగంగా ఉదయం బొడ్రాయికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు బొడ్రాయికి బోనాలు సమర్పించారు.ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. వేడుకల్లో సర్పంచ్ శ్రీపాతి రజిత, ఎంపీటీసీ మంగమ్మ, జెడ్పీటీసీ అనురాధ, రైతు సమన్వయ సమితి కన్వీనర్ నారాయణ, పీసీసీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ శేఖర్‌గౌడ్, స్థానిక నాయకులు కొండయ్య, నర్సింహ, మల్లేశ్, విజయ్, కృష్ణారెడ్డి, జంగారెడ్డి, రాజిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నరేందర్, కార్తీక్, వెంకటయ్య, విక్రం, తిరుపతయ్యగౌడ్, సత్యం, నర్సింహ, బాలు తదితరులు పాల్గొన్నారు.

58, 59 జీఓలను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: 58, 59 జీవోల కింద రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని.. దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉప్పరిగూడలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ, గ్రామ కంఠం భూముల్లో అసంపూర్తిగా, పూర్తిగా ఇళ్ల నిర్మాణాలు చేసిన వారు ఈ జీఓల కింద రెగ్యులరైజ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే ఈనెల 20వ తేదీలోపు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలను పూర్తిచేయాలని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. పది గ్రామాలను కలుపుకొని మండలానికి రెండు చొప్పున సమ్మేళనాలను జరపాలన్నారు. పార్టీ శ్రేణులందరినీ కలుపుకొని పోవాలని పిలుపునిచ్చారు.

కళాకారులను ప్రోత్సహించండి

ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి



కళాకారులకు సహాయం అందజేస్తున్న వరప్రసాద్‌రెడ్డి

తలకొండపల్లి: అంతరించిపోతున్న కళలను బతికించుకుందామని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఫౌండేషన్ నిధులచే కళలకు తగిన ప్రోత్సాహం అందిస్తామన్నారు. మండల పరిధిలోని పడకల్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బీరప్పస్వామి చరిత్ర స్టేజీ నాటకాన్ని ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో వీధి నాటకాలు వేయడం అభినందనీయమన్నారు. అనంతరం నాటక కళాకారులకు ఆయన రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా చిత్రాలు గీసి చిత్రకళలో ప్రావీణ్యం సంపాదించిన పవన్‌ను ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి ఆదివారం కలుసుకున్నారు. పవన్ చిత్రకళలో రాణించడానికి సహాయ సహకారాలు అందజేస్తానని వరప్రసాద్‌రెడ్డి భరోసా పలికారు. అనంతరం ఇటీవల మృతిచెందిన తుల్లా రాములుగౌడ్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో తిరుపతి, మురళీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు నూనె రాఘవేందర్, నరేందర్‌గౌడ్, భరత్, శివా, విజయ్, యాదయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల ఆపన్నహస్తం.. సీఎంఆర్‌ఎఫ్

ఎంపీటీసీ చెరుకూరి మంగ



చెక్కులు అందజేస్తున్న ఎంపీటీసీ మంగ

ఇబ్రహీంపట్నం రూరల్: ఆపదలో ఉన్నవారికి ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ఆపన్న హస్తంగా నిలుస్తుందని పోల్కంపల్లి ఎంపీటీసీ చెరుకూరి మంగ రవీందర్ పేర్కొన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండలంలోని ఉప్పరిగూడలో జరిగిన ఆత్మీయ సమ్మేళనం అనంతరం పోల్కంపల్లి గ్రామానికి చెందిన ఎం.వనజకు రూ.60 వేలు, ఎదుళ్ల లక్ష్మయ్యకు రూ.35,500, ఎదుళ్ల పెంటయ్యకు రూ.45500, కె.వెంకటేష్‌కు రూ.49500 చొప్పున ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల హయాంలో ఎప్పుడూ కూడా ఇంత పెద్దఎత్తున ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేయలేదన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సిఫారసు మేరకు ఒక్కో గ్రామానికి కోట్లాది రూపాయల సీఎంఆర్‌ఎఫ్ సహాయం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోల్కంపల్లి మాజీ సర్పంచ్ దానయ్య, మాజీ ఎంపీటీసీ సావిత్రి నర్సింహ, కోఆప్షన్ సభ్యుడు షరీఫ్, టీఆర్ఎస్ నాయకులు ధన్‌రాజ్, లబ్ధిదారులు పాల్గొన్నారు .

భూ రికార్డులను సరిచేయండి

వైఎస్సార్ టీపీ నేత జంగయ్యగౌడ్

మంచాల: గ్రామీణ ప్రాంతాల్లో భూ రికార్డులను సరిచేయుటకు వీలుగా ధరణి పోర్టల్ ఆన్‌లైన్ విధానం అమలు చేయాలని వైఎస్సార్ టీపీ రాష్ట్ర నాయకుడు మాదగోని జంగయ్యగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామాల్లో కొంతమంది రైతులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఆన్‌లైన్ రికార్డు నుంచి రైతుల పేర్లు తొలగించడం జరిగిందన్నారు. కావాలని కొంతమంది కిందిస్థాయి రెవెన్యూ ఉద్యోగులు అక్రమంగా రికార్డుల్లో పేర్లు నమోదు చేశారు. భూమి లేకుండా ఆక్రమణదారుల పేరు మీద రికార్డులు నమోదు చేయడం జరిగిందన్నారు. వాస్తవాలను పరిశీల చేసి నిజమైన పట్టాదారుల పేర్లమీద భూమి పట్టా రికార్డులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అక్రమ రికార్డులు తొలగించి నిజమైన రైతులకు న్యాయం చేయాలన్నారు.

ఇంటి నిర్మాణానికి ఉప్పల ట్రస్టు చేయూత

తలకొండపల్లి: నిరుపేదల ఇంటి నిర్మాణాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందిస్తున్నాడు. మండల పరిధిలోని వెంకటాపూర్‌కు చెందిన సంతోష ఇంటి నిర్మాణానికి ఆదివారం ట్రస్టు సభ్యులచే ఇసుక, స్టీల్, ఇటుక, సిమెంట్, తదితర మెటీరియల్‌ను అందజేశారు. సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ రమేష్‌యాదవ్, ఎంపీటీసీ సునీత, దర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంజీవ కుటుంబానికి అండగా ఉంటాం

ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: విద్యుత్ శాఖలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు తీవ్ర ప్రమాదనికి గురై నాలుగేళ్లుగా మంచానికే పరిమితమైన సంజీవ కుటుంబానికి ఐక్యతా ఫౌండేషన్ అండగా నిలిచింది. సంజీవ కుటుంబం జీవనోపాధికి ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.లక్ష ఆర్థికసాయం అందించారు. ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామంలో ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఇటీవల పర్యటించారు. ఈసందర్భంగా సంజీవను ఆయన పరామర్శించారు. తన కుటుంబానికి సాయం అందించాలని సంజీవ అభ్యర్థించారు. దీంతో పోలెపల్లి గ్రామంలో సంజీవ భార్య రాములమ్మ కిరాణా షాపు నిర్వహించుకోవడానికి వీలుగా ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆదివారం రూ.లక్ష సాయం అందించారు. సంజీవ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు. తన కుటుంబం జీవనోపాధికి సాయం అందించిన సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డికి సంజీవ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో పోలెపల్లి సర్పంచ్ బాల్‌రాం, ఎంపీటీసీ సభ్యులు కుమార్, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ సత్యం, ఉపసర్పంచ్ అంజన్‌రెడ్డి, నాయకులు బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అభినవ్‌రెడ్డి, శ్రీను, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాలు ఏకం కావాలి

డీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రహమాన్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మంచాల: దళిత శక్తి ప్రోగ్రాం (డీఎస్పీ) ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఆదివారం మంచాల మండల పరిధిలోని జాపాల గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారం దక్కాలని విశారదన్ మహరాజ్ 10వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆ యాత్రకు మద్దతుగా కోటి సంతకాలను సేకరిస్తున్నామని తెలిపారు. దేశంలోని 90 శాతం ప్రజలకు సంబంధించిన సంపద కేవలం పదిమంది చేతుల్లోనే ఉందని.. అందరికి సమాన న్యాయం, అన్ని రంగాల్లో సమానత్వం లభించాలన్నారు. అప్పుడే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్న కలలు సాకారం అవుతాయని అన్నారు. దీనికోసం బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత శక్తి ప్రోగ్రాం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, రాష్ట్ర కార్యదర్శి రవీందర్, మంచాల మండల కన్వీనర్ ఆనంద్, మండల నాయకులు ప్రదీప్, శ్రావణ్, వినోద్, రంజిత్, బాబురావు, రామప్ప తదితరులు పాల్గొన్నారు.

రవీందర్‌కు సన్మానం



రవీందర్‌ను సన్మానించిన జహంగీర్‌ఖాన్

ఇబ్రహీంపట్నం రూరల్: బార్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కొండ రవీందర్‌కు ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు జహంగీర్‌ఖాన్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఆయనను సన్మానించారు.పేదల కోసం పరితపించే నాయకుడు, న్యాయవాది రవీందర్ అని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

‘పది’ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ఎస్ఎస్‌సీ పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన విద్యాశాఖ



కడ్తాల: పరీక్ష కేంద్రంలో నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు

ఆమనగల్లు: ఈనెల 3 నుంచి 13వ తేదీ వరకు జరగనున్న ఎస్ఎస్‌సీ పరీక్షల కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల్లో పరీక్షల ఏర్పాట్లను ఆమనగల్లు ఎంఈఓ సర్దార్‌నాయక్ పరిశీలించారు. ప్రతిరోజు పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరగనున్నాయి. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల్లో మొత్తం పది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 1866 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ తెలిపారు.

హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్టు మండలాల్లో..

హయత్‌నగర్: నేటినుంచి జరిగే పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లను పూర్తి చేశామని హయత్‌నగర్ మండల విద్యాధికారి హీర్యానాయక్ తెలిపారు. హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్టు మండలాల్లోని 28 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 6,519 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు మంచినీరు, మరుగుదొడ్ల సదపాయం, ఫ్యాన్లు, బెంచీలు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఉదయం 9:30 గంటలకు పరీక్షలు ప్రారంభమవుతాయని విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఇప్పటికే హాల్‌టికెట్లు పాఠశాలలకు పంపించామని, హాల్‌టికెట్లు అందనివారు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. 16 పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధిస్తున్నామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఇబ్రహీంపట్నం మండల పరిధిలో..

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల పరిధిలో 1794 మంది రెగ్యులర్ విద్యార్థులు పదోతరగతి వార్షిక పరీక్షలకు హాజరు అవుతున్నారు. పరీక్షల నిర్వహణకు ఎనిమిది కేంద్రాలను ఏర్పాటు చేశారు. టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, గురుకుల విద్యాపీఠ్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీహెచ్ఎస్ (బాలికలు), శాస్త్రా హైస్కూల్, టీఆర్ఎస్ హైస్కూల్, ప్రియాంక స్కూల్, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 11వ తేదీ వరకు ఈ పరీక్షలు కొనసాగుతాయి. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయనున్నారు.

తలకొండపల్లి మండలంలో..

తలకొండపల్లి: సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి వార్షిక పరీక్షలకు మండల పరిధిలోని తలకొండపల్లి, వెల్జాల్‌లో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండు కేంద్రాల్లో 387 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఎంఈఓ సర్దార్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను సమకూర్చినట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

ఏర్పాట్లు పూర్తిచేశాం



కడ్తాల్, ఆమనగల్లు, మాడ్గుల్, తలకొండపల్లి మండలాల్లో పదో పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేశాం. నాలుగు మండలాల్లో 10 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్‌తో పాటు, 10 పరీక్ష కేంద్రాలకు 10 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 10 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించాం. పరీక్షా కేంద్రంలోనికి సెల్‌ఫోన్లు, ఎలాక్ట్రానిక్ వస్తువులు అనుమతించబడవు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి, ప్రశాంతంగా పరీక్షలు రాయాలి.

– సర్దార్‌నాయక్, ఎంఈఓ, కడ్తాల్

మామిడి విషతుల్యం!



పండ్ల మధ్యన రసాయన ప్యాకెట్లను పెడుతున్న వ్యాపారి

- బాటసింగారం మార్కెట్‌లో నిబంధనలకు తూట్లు!
- పక్వం కోసం ఎక్కువ మోతాదులో రసాయనాల వాడకం
- తింటే ఆరోగ్యానికి హాని అంటున్న నిపుణులు

అబ్దుల్లాపూర్‌మెట్: పండ్లల్లో రారాజు మామిడి.. ప్రతి ఏటా మామిడి సీజన్ ప్రారంభం అయ్యింది అంటే దాని రుచిని చూడని వారుండరు అంటే అతిశయోక్తి లేదు. ప్రజల అభిరుచిని అవకాశంగా మల్చుకుంటున్న వ్యాపారులు ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే అమృతంలాంటి మామిడిని త్వరగా పసుపు రంగుతో పాటు పక్వానికి తీసుకువచ్చేందుకు అడ్డుదారులు తొక్కుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మామిడిని పసుపు రంగుతో పాటు త్వరగా పక్వానికి తీసుకువచ్చేందుకు వాడాల్సిన రసాయన పదార్థాలను అధికారులు సూచించిన నిబంధనలకు విరుద్ధంగా మామిడి ప్యాకింగ్ బాక్స్‌లో వాడుతున్న విషయాలు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలోని మామిడి మార్కెట్‌లో వెలుగులోకి వచ్చాయి. ప్రతి ఏటా మామిడి సీజన్ ప్రారంభానికి ముందే ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేసి వ్యాపారులకు అవగాహన కల్పించాల్సిన ఉండగా, ఇప్పటికే సీజన్ ప్రారంభమై దాదాపు పక్షం రోజులు కావస్తున్నా తనిఖీలు చేయకపోవడంతో మామిడి వ్యాపారులు ఇష్టారాజ్యంగా రసాయన పదార్థాలను వినియోగిస్తున్నారు.

నిబంధనలు బేఖాతరు..

మార్కెటింగ్ శాఖ అధికారులు సూచించిన రసాయన పదార్థాల ప్యాకెట్ (0.05గ్రాముల)ను చిన్న ప్లాస్టిక్ బాక్స్‌లో వేసి 24 కేజీల మామిడి ప్యాకింగ్‌లో నేరుగా పండ్లకు తాకకుండా పెట్టి, తిరిగి 24గంటల తర్వాత రసాయన పదార్థ ప్యాకెట్‌ను తొలగించాల్సి ఉంటుంది. అయితే వ్యాపారులు అలా కాకుండా కేవలం 10కేజీల మామిడి ప్యాకింగ్‌లో సుమారు 10వరకు రసాయన ప్యాకెట్లను నేరుగా పండ్లకు తాకేలా పెట్టి ప్యాకింగ్ చేసి తరలిస్తున్నారు. దీంతో ఆ రసాయన పదార్థం పండ్లకు తాకి అవి విషపూరితంగా మారుతున్నాయి. అంతే కాకుండా రసాయన పదార్థం ఉన్న పొట్లాలను నీటిలో ఎక్కువసేపు నానబెట్టి పండ్లలో వేస్తుండటం మరింత ప్రమాదకరం అంటున్నారు నిపుణులు.

ఆరోగ్యానికి ముప్పే..

అధికారులు సూచించిన మోతాదుకు మించి రసాయన పదార్థాలను మామిడి ప్యాకింగ్‌లో వాడితే అలాంటి పండ్లు తిన్నవారి ఆరోగ్యాలకు ముప్పు వాటిల్లే ప్రమాదాలున్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలకు, పెద్దలకు క్యాన్సర్, ఎముకలు, నరాల బలహీనత, శరీరంలోని ముఖ్యమైన భాగాలపై తీవ్రమైన ప్రభావం పడుతుంది.

అధికారులు పర్యవేక్షించాలి..

మామిడి సీజన్‌లో ఆహార భద్రత అధికారులు, విజిలెన్స్ అధికారులు పండ్ల మార్కెట్లో తనిఖీలు చేపట్టి, వ్యాపారులకు అవగాహన కల్పించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



మామిడి వ్యాపారులు, ఫుడ్‌సెఫ్టీ అధికారులతో కలిసి తరచూ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో పాటు మార్కెట్‌ల్లో పండ్ల ప్యాకింగ్‌ను నిత్యం పర్యవేక్షిస్తుంటాం. మామిడి ప్యాకింగ్‌లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ఎక్కువ మోతాదులో రసాయన పదార్థాలు వాడుతున్న వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటాం.

– చిలుక నర్సింహారెడ్డి, ఉన్నత శ్రేణి కార్యదర్శి, బాటసింగారం పండ్ల మార్కెట్